# కలుపునాశని మందులతో
# అమెరికాలో జరుగుతున్న పంట నష్టం

**మోన్సాంటో,** డ్యూపాంట్ కంపెనీలు కలుపునాశని 'డికాంబా'ను అమెరికాలోని రైతులకు విస్తారంగా అమ్మాయి. వీటికి తోడు మోన్సాంటో కంపెనీ అతి ఖరీదైన డికాంబాను తట్టుకునే విశిష్టగుణం గల సోయాబీన్ విత్తనాలను కూడా అమెరికాలోని రైతులకు అమ్ముకుంటోంది.

మోన్సాంటో అమ్ముతున్న రౌండ్ అప్‌రెడీ సోయాబీన్ విత్తనాలు ఒక మూట 28 డాలర్లయితే; బేయర్ కంపెనీ యొక్క లిబర్టీ కలుపునాశనానిని తట్టుకొనే రకం సోయాబీన్ విత్తనాలు ఒక మూట ఖరీదు 50 డాలర్లయితే; మోన్సాంటో యొక్క డికాంబాను తట్టుకొనే విశిష్ట రకం సోయాబీన్ విత్తనాల మూట ఖరీదు 64 డాలర్లు. ఈ విత్తనాలను వాడినట్లయితే ఒక ఎకరానికి, 5 డాలర్ల నుండి 10 డాలర్ల వరకు అదనపు ప్రీమియం ధర (అమ్మకంపై) లభిస్తుందంటూ ప్రచారంచేసి ఆ విత్తనాలను అమ్మకం చేశారు.

ఈ విశిష్ట గుణంకల సోయాబీన్, ప్రత్తి విత్తనాల పంటపై చల్లే 'డిసెంబా' కలుపు నివారిణి రసాయనం వలన పంటలు దెబ్బతింటున్న అనుభవాన్ని అమెరికన్ రైతులు చవిచూశారు.

యూనివర్సిటీ ఆఫ్ మిస్సోరీ ప్రకారం, ఈ వేసవిలో చల్లిన డిసెంబా కలుపు నివారిణి మందువలన 3.1 మిలియన్ల ఎకరాలలోని సోయాబీన్ పంట దెబ్బతింది. అంటే అమెరికాలో విత్తన సోయాబీన్ పంటలో 3.5 శాతం పంట యీ కలుపునివారిణి మందువల్ల దెబ్బతింది.

ఈ కలుపునివారిణి రసాయనాన్ని చల్లిన వెంటనే, అది యితర వ్యవసాయక్షేత్రాలకు గాలిద్వారా కొట్టుకుపోయి మిలియన్ల ఎకరాల సోయాబీన్ తదితర పంటలకు నష్టం వాటిల్లినట్లు అమెరికాలోని వ్యవసాయ క్షేత్రాల వారు ఫిర్యాదు చేశారు.

కనుక తిరిగి యీ సంవత్సరం, అటువంటి నష్టం సంభవించకుండా చూడాలంటూ దక్షిణ డకోటా రాష్ట్ర యూనివర్సిటీలోని పురుగుల మందుల నిపుణుడైన ఆంద్రూ థోస్టెన్‌సన్ అమెరికా దేశపు పర్యావరణ ఏజెన్సీని హెచ్చరించాడు.

ఏప్రియల్ 15 (2018) తర్వాత డిసెంబామందును చల్లకుండా నిషేధించమంటూ అర్కాన్‌సాస్ రాష్ట్రంలోని ఒక టాస్క్‌ఫోర్సు, ప్రభుత్వానికి సలహా యిచ్చింది.

అమెరికాలోని రైతులు వసంత రుతువులో రాబోయే నెలల్లో ఏ పంటలు వెయ్యాలా అని నిర్ణయించు కుంటారు. ఈలోగానే, ప్రభుత్వ నియంత్రణ సంస్థలు డికాంబా కలుపునాశనిపై నిషేధం విధించాలనే డిమాండ్ నిపుణుల నుండి వెల్లడవుతోంది.

ఆ రకంగా డికాంబా మందుపై నిషేధం విధిస్తే, మోన్సాంటో, డ్యూపాంట్ కంపెనీల అమ్మకాలు దెబ్బతింటాయి. అందువలన యీ కంపెనీలు జరిగిన పంట నష్టానికి (దెబ్బతినటానికి) కారణం తమ కలుపు నివారణ రసాయనంకాదనీ, ఆ రసాయనాన్ని రైతులు సక్రమంగా వాడకపోవటమేనంటూ వాదిస్తున్నాయి. కానీ నిపుణులు యీ వాదనను కొట్టిపారేస్తున్నారు. కలుపునాశని మందులు చల్లినప్పుడు ఆవిరైపోయి, యితర ప్రాంతాలకు ఆవిరి రూపంలో కొట్టుకుపోయి, అక్కడ పంటలపై పడతాయనీ, ఆరకంగా ఆ పంటలను నాశనం చేస్తాయనీ స్పష్టంగా చెబుతున్నారు.

ఈ రకంగా, వివిధ వ్యవసాయక అంశాలపట్ల చైతన్యంగల రైతులున్న, అప్రమత్తతో వ్యవహరించే ప్రభుత్వ నియంత్రణ సంస్థలున్న, అభివృద్ధిచెందిన అమెరికా దేశంలోనే మోన్సాంటో, డ్యూపాంట్, బేయర్ లాంటి బడామందుల/విత్తనాల కంపెనీలు రైతులను ఏమార్చుతూ తమ విత్తనాలనూ, పురుగుమందులనూ చాకచక్యంగా అమ్ముకొంటున్న నేపథ్యంలో, ఆయా కంపెనీలు జరిపే మోసపూరిత ప్రచారాలను తట్టుకొని, వారి బారినపడకుండా భద్రంగా వుండటం అన్నది మనదేశంలోని రైతాంగానికి ఎంత కష్టసాధ్యమో అర్థం చేసుకోవల్సివుంది.

నిజానికి అమెరికా రైతులు ఎదుర్కొంటున్న పైన చెప్పబడిన అనుభవం, సామ్రాజ్యవాద దోపిడీ – సామ్రాజ్యవాద బడాకార్పొరేషన్ల దోపిడీ – ఎంత పకడ్బందీగా సాగుతోందో తెలియచేస్తోంది.

మనదేశంలో మోన్సాంటో, బేయర్, డ్యూపాంట్ కంపెనీలు రైతాంగాన్ని చేసుకొంటున్న దోపిడీ (విత్తనాలు, పురుగుమందులు, కలుపు నివారణ మందుల అమ్మకం రూపాలలో) పట్ల మన రైతాంగం, రైతుసంఘాలు అప్రమత్తంగా వుండాల్సిన అవసరాన్ని పై ఉదంతం నొక్కి చెప్తోంది.

oooooo